క్లుప్తంగా

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సూచించారు. పట్టణంలోని యాపల్, అంగడిబజార్, మారతినగర్, విద్యానగర్, దీపక్‌నగర్, శ్రీపతినగర్ తదితర ఏరియాల్లో సోమవారం పర్యటించి అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, ఇంజనీర్ సందీప్‌లతో కలిసి సమీక్షించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మహా ప్రస్థానానికి విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: మంచిర్యాల పద్మనాయక (వెలమ) సంక్షేమ మండలి నాయకులు సోమవారం మహాప్రస్థానానికి రూ.10లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో మంచిర్యాల వెలమ సంక్షేమ మండలి అధ్యక్షుడు మల్రాజు రామారావు, నాయకులు మెట్టుపల్లి కిషన్‌రావు, పాలసాని సత్యనారాయణ రావు, పానుగోటి రామారావు, నడిపెల్లి రామారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత

మంచిర్యాలటౌన్: మే 1న నిర్వహించే మే డే దినోత్సవ ఆహ్వాన పత్రికను తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు అందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం, శంకరయ్య, శ్రీనివాస్, గోపాల్, రాయలింగు, సుమన్, రాములు, రాజం, లింగయ్య, నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటి కుంట పనులు తనిఖీ



మస్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో

వేమనపల్లి: మండలంలోని గొర్లపల్లి గ్రామ పంచాయతీ అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న ఉపాధిహామీ నీటికుంట పనులను ఎంపీడీవో కుమారస్వామి సందర్శించారు. మస్టర్లు తనిఖీ చేశారు. అనంతరం గొర్లపల్లిలోని నర్సరీని పరిశీలించారు. ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శి సాయి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలోని 33కేవీ లైన్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్‌లో అంతరాయం ఉంటుందని కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ కేశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పవర్ ప్లాంట్ వద్ద బస్సుషెల్టర్ ప్రారంభం

జైపూర్: మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆవరణలో నూతనంగా నిర్మించిన బస్సు షెల్టర్‌ను సోమవారం ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచిర్యాల–చెన్నూర్ 63వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఎస్టీపీపీ ప్రధాన గేటు ముందు కార్మికులు, ఉద్యోగుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏజీఎంలు, ప్రసాద్, మధన్ మోహన్, సీఎంవోఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఏఐటీయూసీ అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ పర్సయ్య, పవర్‌మేక్ హెడ్ అఖిల్‌కపూర్, డీజీఎంలు అజాజుల్లఖాన్, వేణుగోపాల్, అజ్మీరతుకారాం పాల్గొన్నారు.

నేడు బార్‌కు లక్కీడ్రా

మంచిర్యాలక్రైం: జిల్లాలో మూతపడిన రెండు బార్లకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించగా మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో ఒక బార్‌కు 15మంది, బెల్లంపల్లిలో ఒక బార్‌కు ఒక్కరే దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లో మంచిర్యాల కార్పొరేషన్ పరిధి బార్‌కు లక్కీడ్రా నిర్వహించనున్నట్లు స్థానిక ఎక్సైజ్ శాఖ సీఐ గురువయ్య తెలిపారు. బెల్లంపల్లికి ఒక్కటే దరఖాస్తు రావడంతో మే 6వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు.

ట్రామాకేర్ సెంటర్‌కు నిధులు

- చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో త్వరలో ఏర్పాటు
- అత్యవసర సమయంలో వైద్యం అందించేలా ఏర్పాట్లు
- స్థానికులతోపాటు మహారాష్ట్ర ప్రజలకు ప్రయోజనం



చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం

చెన్నూర్: చెన్నూర్‌లో ట్రామాకేర్ సెంటర్ త్వరలో ఏర్పాటు కానుంది. రూ.కోటి నిధులు మంజూరు కాగా, ప్రస్తుతం 50 పడకల ఆస్పత్రిలో సేవలందించనుండగా, వంద పడకల ఆస్పత్రి పనులు పూర్తయితే అందులోకి మార్చనున్నారు. ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుతో ఒక్క న్యూరోసర్జన్, ఒక్క ఆర్థోపెడిక్ వైద్యులతో పాటు, సిటీస్కాన్, ఎక్స్‌రే ప్లాంట్‌లు అందుబాటులోకి రానున్నాయి. అత్యవసర సమయాల్లో నరాలు, ఎముకలకు సంబంధించిన వైద్య సేవలు సకాలంలో అందనున్నాయి. ఇప్పటికే చెన్నూర్‌లో రూ.10కోట్ల నిధులతో నిర్మించిన 50పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన విషయం తెలిసిందే. దీంతో పాటు బస్తీ దవాఖానాలు ప్రజలకు వైద్య సేవలందిస్తున్నాయి. రూ.20కోట్ల నిధులతో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవనం త్వరలో పూర్తి కానుంది. భవనం పూర్తయితే చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, భీమారం మండలాలతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ప్రస్తుతం 50పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిత్యం 150నుంచి 200మంది పేషంట్లు, ఐదు షిఫ్టుల్లో డయాలసిస్ రోగులు వైద్య సేవలు పొందుతున్నారు.

పేదలకు మేలు జరుగుతుంది..



వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం సకాలంలో పూర్తి చేసి ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తే పేదలకు మేలు జరుగుతుంది. చెన్నూర్ ఎమ్మెల్యే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ట్రామాకేర్ సెంటర్‌ను మంజూరు చేయించడం సంతోషంగా ఉంది.

- గన్‌శ్యామ్, సామాజిక కార్యకర్త, చెన్నూర్

సిటీస్కాన్, ఎక్స్‌రేలు ఉండాలి..



ప్రస్తుతం ఉన్న 50పడకల ఆసుపత్రిలో సిటీస్కాన్, ఎక్స్‌రే పరికరాలు అందుబాటులో లేక మంచిర్యాలకు వెళ్లాల్సి వస్తోంది. ట్రామాకేర్‌తో వైద్యులు, సిటీస్కాన్, ఎక్స్‌రే అందుబాటులోకి వస్తే గరీబోళ్లకు మెరుగైన వైద్య సేవలందుతాయి. వైద్య సదుపాయాలు ప్రజలకు త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలి.

- సామల మోహన్, చెన్నూర్

ఎమ్మెల్యే సహకారంతో..



వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు 90శాతంకు పైగా పూర్తయ్యాయి. ఇటీవల ఎమ్మెల్యే కృషితో ట్రామాకేర్ సెంటర్ మంజూరైంది. వైద్యులు, ఖరీదైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

- డి.సత్యనారాయణ, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, చెన్నూర్

'కాంగ్రెస్ అభివృద్ధికి ప్రతీ కార్యకర్త పాటుపడాలి'



నాయకులు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, పక్కన ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రతీ కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. బెల్లంపల్లి శివారు కన్నాలలోని ఆర్‌పీ గార్డెన్‌లో సోమవారం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, డీసీసీ అధ్యక్షురాలు కె.సురేఖ, టీపీసీసీ పరిశీలకులు జంగ రాఘవరెడ్డి, రాంభూపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతీ కార్యకర్త, నాయకులకు అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీని మరింతగా బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే, ఎంతటి వారైన సహించేది లేదన్నారు. ఎవరైన అలా చేస్తే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే వినోద్ కోరారు. ఇందిరమ్మ ఇళ్లు నిరుపేదలకు అందడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. అంతకు ముందు పహెల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో భాగంగా జై బాబు, జై భీమ్, జై సమ్విధాన్ రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు పాల్గొన్నారు.

శ్రద్ధగా చదివి ప్రయోజకులు కావాలి

బెల్లంపల్లి: విద్యార్థులు శ్రద్ధగా చదివి ప్రయోజకులు కావాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 14మంది విద్యార్థులకు దివంగత సీడీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు పద్మారెడ్డి జ్ఞాపకార్థం ఆమె కొడుకు ఎన్నారై తోడే కృష్ణారెడ్డి ఎమ్మెల్యే గడ్డం వినోద్ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చదువు ఉజ్వల భవిష్యత్‌ను అందిస్తుందన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎంతో ఉదారస్వభావంతో ఎన్నారై ఒక్కో విద్యార్థికి రూ.2,500చొప్పున నగదు బహుమతిని అందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సూరిబాబు, రమేశ్, పలువురు మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, లెక్చరర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

జడ్జికి ఘనంగా వీడ్కోలు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ జోగిపేటకు బదిలీ కాగా, హైదరాబాద్ నుంచి సాయికిరణ్ లక్సెట్టిపేటకు వస్తున్నారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయనకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, సీనియర్, జూనియర్ న్యాయవాదులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కొక్కిరాల రఘుపతి రావు చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి పక్కా నిర్మాణ భవన పనులను పరిశీలించారు. వేగవంతం చేయాలని, జాప్యం లేకుండా నాణ్యతగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యువ నాయకులు ఉదయ్ చరణ్ రావు, నాయకులు ఎండీ ఆరీఫ్, పింగిళి రమేశ్, నాగభూషణం, అశోక్ పాల్గొన్నారు.

నియామకం

భీమారం: జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా భీమారం మండలం ధర్మారంకి చెందిన కుడెంత శంకర్‌ను నియమిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు చంద లింగయ్య సోమవారం తెలిపారు.

మందమర్రిరూరల్: ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మందమర్రి పట్టణానికి చెందిన ఉప్పులేటి నరేష్‌ను నియమిస్తూ ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపెల్లి బానయ్య సోమవారం నియామకపత్రం అందించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్నదానం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మాజీ కౌన్సిలర్లు మాదంశెట్టి సత్యనారాయణ, పూదరి ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్: ప్రపంచ కార్మిక పోరాట దినోత్సవం మే డే వేడుకల పోస్టర్‌ను స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో సోమవారం ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి పౌల్, సీపీఐ మండల కార్యదర్శి నెన్నల సమ్మయ్య, పట్టణ కార్యదర్శి సుంకరి చందు, నాయకులు బడికల మదునయ్య, నారాయణ, శంకర్, రాజమల్లు పాల్గొన్నారు.

'కేంద్రం విధానాలు కార్మికులకు వ్యతిరేకం'

వేమనపల్లి: కేంద్రంలో బీజేపీ కార్మికుల వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో మే డే పోస్టర్ ఆవిష్కరించారు. 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఎం జిల్లా కార్యదర్శి బాపు, నాయకులు పురుషోత్తం, శంకర్, నాగయ్య, మంజుల, కళావతి, శ్రీవాణి, తేజస్విని, మల్లేష్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాడాలి

తాండూర్: మేడే స్ఫూర్తిగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాడాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం మాదారం సివిక్ కార్యాలయం ఆవరణలో మే డే పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బుచ్చన్న, నాందేవ్, తిరుపతి, సురేశ్, శకుంతల, ఓదమ్మ, చంద్రక్క, యశోద పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి

శ్రీరాంపూర్: కశ్మీర్‌లోని పహల్గాం మృతుల కుటుంబాలకు ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ 3, 3ఏ గనిపై కార్మికుల సమక్షంలో సోమవారం నివాళులర్పించారు. యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యాయుడు జెట్టి శంకర్‌రావు మాట్లాడుతూ ఉగ్రవాద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గరిగే స్వామి, పేరం రమేశ్, గోపాల్ రెడ్డి, వీరమల్లు, నరసింహారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ మండలంలోని ఆస్నాద గ్రామంలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సొదారి సారయ్య, వడ్లకొండ వినోద్, మద్దూరి ప్రశాంత్, కార్మికులు పాల్గొన్నారు.

ధోబీఘాట్ నిర్మాణ పనులు చేపట్టాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న మోడ్రన్ మెకానిజం లాండ్రీ యూనిట్(మోడ్రన్ ధోబీఘాట్)ల నిర్మాణ పనులు ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య అన్నారు. అసంపూర్తిగా ఉన్న ధోబీఘాట్‌లను సోమవారం పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో ధోబీఘాట్‌కు రూ.2కోట్లు నిధులు కేటాయించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు నిలిపివేశారన్నారు. ధోబీఘాట్ నిర్మాణ పనులు పునరుద్ధరించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, పట్టణ అధ్యక్షుడు పారుపెల్లి శ్రీనివాస్, కోశాధికారి పోచన్న పాల్గొన్నారు.

పట్టణ అధ్యక్షుడిని మార్చాలని ఎమ్మెల్యేకు వినతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా వర్గపోరు నడుస్తోంది. వర్గాలకు అతీతంగా ఎమ్మెల్యే వినోద్ ఓ పక్క తనవంతు యత్నాలు చేస్తుండగా, మరో పక్క వర్గ రాజకీయాలు క్రమంగా పొడచూపుతున్నాయి. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లి ఎమ్మెల్యే వినోద్‌తో సంప్రదింపులు జరిపిన కాంగ్రెస్ పార్టీలో మళ్లీ అసమ్మతి రాజుకుంది. బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్, అధికారిక కార్యక్రమాలను ఇద్దరు సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో కొనసాగుతాయని ఇందుకు నాయకులు, కార్యకర్తలంతా కలిసికట్టుగా పని చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. కానీ ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా సోమవారం పలువురు కాంగ్రెస్ నాయకులు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిని మార్చాలని క్యాంపు కార్యాలయం వద్ద నినాదాలు చేయడం చర్చనీయాంశమైంది. ఈ మేరకు తమ అభిప్రాయాలను నాయకులు, ద్వితీయశ్రేణి కార్యకర్తలు ఎమ్మెల్యేకు వెల్లడించారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ శ్రేణులు తెలిపారు.

'ఉపాధి' సామర్థ్యాన్ని పెంచేందుకు శిక్షణ

- కలెక్టర్ కుమార్‌దీపక్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉపాధి సామర్థ్యాన్ని పెంచే నైపుణ్య శిక్షణ పొందిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ డిపార్ట్‌మెంట్ (టాస్క్ శిక్షణ కేంద్రాన్ని) టాస్క్ సీఈవో శ్రీకాంత్ స్నేహ, స్టేట్ కో ఆర్డినేటర్ నవీన్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణలతో కలెక్టర్ కుమార్‌దీపక్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 30రోజుల పాటు అర్హత గల యువతకు పరిశ్రమ సంబంధిత నైపుణ్యం అందించనున్నట్లు, తద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందించడం జరుగుతుందన్నారు. శిక్షణ మొదటి విడతలో భాగంగా 40మంది నిరుద్యోగ యువత ఎంపికైన వారు శిక్షణలో భాగంగా సీ, సీ++, జావా, పైథాన్, ఆప్టిట్యూడ్ రీజనింగ్, (ఆర్అండ్ఆర్) ఇంటర్వ్యూ నైపుణ్యాలను పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణానంతరం నైపుణ్యత గల అభ్యర్థులకు ఉపాధి అవకాశానికి సహాయం అందించనున్నట్లు తెలిపారు. తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లాకు చెందిన పలు శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యను ఆపేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని, 14 ఏళ్లు పైబడిన అభ్యర్థులు టెన్త్, 15ఏళ్లు పైబడిన వారు ఇంటర్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉల్లాస్ పతకంలో భాగంగా అభ్యాసకులను, స్వచ్ఛంద బోధకులను ఆన్‌లైన్ వెబ్‌సైట్ https://ullas.education.gov ద్వారా ఎవరికి వారు నమోదు చేసుకునే సదుపాయం ఉందన్నారు. ఉల్లాస్‌కు సంబంధించిన తరగతి గదులు, సామాజిక చైతన్య కేంద్రాలైన ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, లైబ్రరీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న ఎర్రగుంటపల్లి గ్రామస్తులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లిలో ఇళ్లు ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని సోమవారం చెన్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. నిరుపేదలకు ఇళ్లు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఇళ్లు లేని వారికి ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

సర్వే అధికారుల అడ్డగింత

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేట లంబాడి తండాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకొని అర్హులకు రాలేదని వాదనకు దిగారు. ఎంపీవో సబ్దర్ అలీ, పంచాయతీ కార్యదర్శి ఇతర సిబ్బందితో జాబితాలో ఉన్న వారి వివరాలు తెలుసుకునేందుకు సోమవారం వెళ్లగా అర్హులకు రాకుండా, అన్ని ఉన్నవారికి వచ్చాయని, సర్వే ఎందుకు అని.. అడ్డుకొని వాదనకు దిగారు. సర్వే చేస్తే అర్హులో కాదో తెలుస్తుందని తెలిపినప్పటికీ వినకపోవడంతో అధికారులు సర్వే చేయకుండానే వెనుదిరిగారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

జన్నారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల వివరాల నమోదు కోసం అధికారులు ఇంటింటా పర్యటిస్తున్నారు. కలమడుగులో సోమవారం ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎంపీడీవో ఉమర్‌షరీఫ్ వివరాలు సేకరించారు. మండలంలో మొత్తం 631మందికి మొదటి విడుతలో పేర్లు వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట కలమడుగు కార్యదర్శి వినోద్, సిబ్బంది ఉన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆదివాసీ నాయిని కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలని సోమవారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, సీఐటీయూ, వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ కన్నయ్య మరణానికి కారకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలన్నారు. నాయకులు మల్లేశ్వరి, శంకర్, సంకె రవి, బోడంకి చందు, గోమాస రాజబాబు, దుంపల రంజిత్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, కే.ప్రేమ్‌కుమార్, సమ్మక్క, జ్యోతి, రాజేందర్ పాల్గొన్నారు.

యూనివర్సల్ బ్యాంకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ వి.వినయ్‌కుమార్

మంచిర్యాలఅగ్రికల్చర్: అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025సందర్భంగా సోమవారం మంచిర్యాల పట్టణంలోని యూనివర్సల్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా సహకార అధికారి బి.మోహన్, బ్యాంకు చైర్మన్ వి.వినయ్‌కుమార్, ఇన్‌చార్జి సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి పాల్గొని మాట్లాడారు. బ్యాంకు చిన్న, మధ్య తరగతి ప్రజలకు అండగా ఉంటూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఈ సదస్సులో డైరెక్టర్లు సుబ్రహ్మణ్యేశ్వర రావు, జి.కృష్ణమూర్తి, ఆర్.ప్రసాద్ రావు, జే.శ్రీదేవి, జి.రాయలింగు, భాను ప్రకాశ్, బక్కయ్య, రత్నం, కే.సుశీల, ఎస్. విజయలక్ష్మి, ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.23వేలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రామకృష్ణాపూర్/శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హైకోర్టు తీర్పు ప్రకారం కనీస నెల వేతనం రూ.23వేలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆ యూనియన్ అధ్యక్షుడు, కనీస వేతనాల సలహా మండలి సభ్యుడు ఎండీ యూసఫ్, ప్రధాన కార్యదర్శి ఎండీ అక్బర్ అలీలు హైదరాబాదులోని లేబర్ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కనీస వేతనాల సలహా చైర్మన్ బీ.జనక్ ప్రసాద్, కమిషనర్ శ్యాంసుందర్‌జాదవ్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు. హైకోర్టు తీర్పును అనుసరించి కొత్త వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధ హక్కులు కల్పించాలన్నారు. మే 1 నుంచి కొత్త వేతనాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కనీస నాయకులు అఫ్రోజ్‌ఖాన్, కృష్ణయ్య, క్రిష్టఫర్, దొడ్డిపట్ల రవీందర్ పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

రిటైర్డ్ కార్మికులను ఆదుకోవాలి

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థలో ఉద్యోగం చేసి విరమణ పొందిన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించి ఆదుకోవాలని సింగరేణి రిటైర్డ్ కార్మికుల అసోసియేషన్ (35/2025) అధ్యక్షుడు వాసాల శంకర్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జక్కుల రాజన్న, కోశాధికారి ఆసం కొమురయ్య, చీఫ్ ఆర్గనైజర్ శంకర్, ఓదెలు సంపత్, ఖలీల్, రాజనర్సు, తుంగపిండి శంకర్ ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



వేమనపల్లి: మండలంలోని నీల్వాయి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల 2008–09 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠశాలలో విద్యనభ్యసించిన ఉపాధ్యాయులను సన్మానించారు.